క్లుప్తంగా

నూజివీడు డిపోకు కొత్త బస్సులు ఇవ్వాలి


ఆర్టీసీ ఈడీ ఆపరేషన్స్‌తో ఫోన్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

నూజివీడు: స్థానిక ఆర్టీసీ డిపో నుంచి దూర ప్రాంతాలకు నడిచే పాతబస్సుల స్థానంలో కొత్త బస్సలను ఇవ్వాలని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు కోరారు. ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆపరేషన్స్‌తో శుక్రవారం ఎమ్మెల్యే ఫోన్‌లో మాట్లాడారు. హైదరబాద్‌కు నడిచే బస్సులు కాలం చెల్లడంతో వర్షం పడినప్పుడు బస్సు లోపలకు వర్షంనీరు పడుతోందని, ప్రయాణికులు ఎలా ఎక్కుతారని ప్రశ్నించారు. నీరు కారే బస్సుల స్థానంలో నూతన బస్సులను ఏర్పాటు చేయాలని, బెంగళూరుకు, హైదరాబాద్‌కు ఒక్కొక్క సర్వీసు చొప్పున ఏసీ స్లీపర్ సర్వీసులను నడపాలని కోరారు. నూతన బస్సులను ఏర్పాటు చేస్తే ప్రజలు తప్పనిసరిగా ఆదరిస్తారన్నారు. ప్రస్తుతం శ్రీశైలానికి ఉన్న ఒక సర్వీసు విజయవంతంగా నడుస్తోందని, రెండో సర్వీసును కూడా ఏర్పాటు చేయాలని కోరారు.

వేసవిలో దప్పిక తీర్చడం మాధవ సేవే

వెల్వడం(మైలవరం): వేసవిలో దప్పిక తీర్చడం మాధవ సేవేనని పూర్వ విద్యార్థుల సంఘం నాయకుడు గూడూరు నాగిరెడ్డి తెలిపారు. మైలవరం మండలం వెల్వడం గ్రామంలోని దివంగత లకిరెడ్డి పాపులమ్మ మెమోరియల్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1987 నుంచి 1992 వరకు 6 నుంచి 10వ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం తాగునీటి చలివేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థిని తోట అంజలీ ఏడుకొండలు సహకారంతో పాదచారులకు, వాహదారులకు పులిహోర పంపిణీ చేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ



ఉటుకూరు(గంపలగూడెం): మండలంలోని ఉటుకూరులో వాసవి, వనిత, కన్యక క్లబ్ ఆధ్వర్యంలో బస్టాప్ సెంటర్ వద్ద నిర్వహిస్తున్న చలివేంద్రంలో శుక్రవారం మజ్జిగ పంపిణీ చేశారు. క్లబ్బుల ప్రతినిధులు వేముల ప్రకాష్‌బాబ్జి, ఫణికుమార్, కాజా శ్రీనివాసరావు, రోశయ్య పాల్గొన్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

తిరువూరు: రంజాన్ మాసం సందర్భంగా స్థానిక జామియా మసీదులో శుక్రవారం సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఉపవాస దీక్షలు నిర్వహించే ముస్లింలకు సీపీఎం పట్టణ కార్యదర్శి మేకల నాగేంద్రప్రసాద్, నాయకులు వెంకటరత్నం, ఎస్వీభద్రం, ప్రభాకరరావు, ఆకుల రవి రంజాన్ మాస శుభాకాంక్షలు తెలియజేశారు.

పశ్చిమ ఇబ్రహీంపట్నంలో..

ఇబ్రహీంపట్నం: పశ్చిమ ఇబ్రహీంపట్నంలో రంజాన్ మాసం సందర్భంగా ఉపవాసం ఉన్న ముస్లింలకు ముస్లీం యువకులు శుక్రవారం రాత్రి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. స్థానిక మసీదు వద్ద జరిగిన ఇఫ్తార్ విందులో ఉపవాసం ఉన్న ముస్లింలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థికి ఉపాధి కల్పించడమే ధ్యేయం



కేతనకొండ(ఇబ్రహీంపట్నం): కళాశాలలో విద్య పూర్తిచేసిన ప్రతి విద్యార్థికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే ధ్యేయంగా పనిచేస్తున్నామని ఆర్కే ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ ఎంఎం కొండయ్య అన్నారు. కళాశాలలో ఇంజినీరింగ్ పూర్తిచేసుకుని వెళుతున్న విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చదువు పూర్తిచేసిన వారికి వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు కల్పించడం ఆనందాన్ని ఇస్తుందన్నారు. నియామక పత్రాలు అందజేశారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. ప్రిన్సిపాల్ కె.రామకృష్ణయ్య పాల్గొన్నారు.

ఘనంగా జలబిందెల ఉత్సవం

కనుమూరు(గంపలగూడెం): కనుమూరులో గ్రామ దేవతలు అంకమ్మ మహాలక్ష్మమ్మ జాతర, తిరునాళ్లో భాగంగా రెండో రోజు శుక్రవారం జలబిందెల ఉత్సవం ఘనంగా జరిపారు. ముందుగా మహిళలు బిందెలు, కుండలతో జలాన్ని తీసుకువచ్చి బొడ్డురాయి సెంటర్లో ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం జలాన్ని భక్తులు ఒకరిపై ఒకరు చల్లుకుంటూ అమ్మవార్ల గుడి వద్దకు చేరుకున్నారు. శనివారం గుడి వద్ద తిరునాళ్ల నిర్వహిస్తారు. కమిటీ ఆధ్వర్యంలో తగిన ఏర్పాట్లు పూర్తి చేశారు.

హామీలకు మించి సంక్షేమ పథకాల అమలు

ఎమ్మెల్యే రక్షణనిధి



జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి

విస్సన్నపేట: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలకు మించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో సంక్షేమ పథకాలను పార్టీలకతీతంగా అమలు చేస్తున్నట్లు ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి అన్నారు. స్థానిక ద్వారకానగర్‌లో కనకదుర్గా అమ్మవారి దేవస్థానం వద్ద పూజలు నిర్వహించి జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే శుక్రవారం ప్రారంభించారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేసి వైఎస్సార్ సీపీ మాటతప్పని ప్రభుత్వంగా ప్రజల్లో స్థానం సాధించిందన్నారు. గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు, మండల కన్వీనర్లతో నియోజకవర్గంలో ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందుతున్నాయా లేదా తెలుసుకోవటంతో పాటు జగనన్న పాలనలో అమలు అవుతున్న సంక్షేమ పథకాలకు సంబంధించి అభిప్రాయాలు సేకరించటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు భీమిరెడ్డి లోకేశ్వరరెడ్డి, ఎంపీపీ పిల్లి మెర్సీవనజాక్షి, గృహసారథుల మండల కన్వీనర్ అనుమోలు శివబాజీ,సర్పంచ్ సాధుపాటి నాగమల్లేశ్వరి, వైస్‌ఎంపీపీ శ్రీనివాసరావు, మాజీ వైస్ ఎంపీపీ ఓలేటి దుర్గారావు, కేడీసీసీబీ డైరెక్టర్ భూక్యా రాణి, వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ సభ్యుడు ప్రకాష్, పట్టణ అధ్యక్షుడు నెక్కళపు కుటుంబరావు పాల్గొన్నారు.

ప్రజల నుంచి పుట్టిందే 'జగనన్నే మా భవిష్యత్తు'

మైలవరం: ప్రజల నుంచి పుట్టిందే 'జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగనన్న' కార్యక్రమాలు అని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ తెలిపారు. మైలవరంలోని చంద్రబాబు నగర్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం జరిగింది. ముఖ్యమంత్రి జగన్ ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమం ప్రారంభించారు. ఇంటింటికీ వెళుతూ జగనన్న ప్రభుత్వంలో జరిగిన మంచిని వివరించారు. గత ప్రభుత్వం హామీలు ఇచ్చి అమలు చేయకుండా మోసం చేసిన విధానాన్ని సమగ్రంగా వివరించారు. ప్రజా మద్దతు పుస్తకంలో పలు ప్రశ్నలు అడిగి ప్రజల అభిప్రాయాలు నమోదు చేశారు. అనంతరం వారి అనుమతితో పోస్టర్‌లు, స్టిక్కర్‌లు, తలుపులకు స్టిక్కర్‌లు అంటించారు. అన్ని చోట్లా పార్టీ శ్రేణులు ఇందులో మమేకమై ఏప్రిల్ 20లోపు కార్యక్రమాన్ని ముగించాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎమ్మెల్యే వసంత మాట్లాడుతూ దశాబ్ద కాలంగా ఎమ్మెల్యేగా, మంత్రిగా దేవినేని ఉమా పని చేసినప్పటికీ మైలవరం అభివృద్ధికి చేసిందేమీ లేదన్నారు. పదేళ్ళలో మాజీ మంత్రి ఒక్క సిమెంట్ రోడ్ మాత్రమే నిర్మిస్తే, వైఎస్సార్ ప్రభుత్వం వచ్చిన తరువాత తాను గెలిచిన నాటి నుంచి ఇప్పటి వరకు ఆరు రహదారులను సిమెంట్ రహదారులుగా అభివృద్ధి చేశామన్నారు. ఐదు ప్రధాన డ్రెయిన్లను నిర్మించడం జరిగిందన్నారు. మరో రూ.40 లక్షల నిధులు తాజాగా మంజూరు చేసినట్లు తెలిపారు. ఇవి కాక గడప గడపకు మన ప్రభుత్వం మైలవరంలోని మూడు గ్రామ సచివాలయాల్లో పూర్తయితే మరో రూ.60లక్షలు నిధులు మంజూరవుతాయన్నారు. వీటితో కూడా ముమ్మరంగా అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే వసంత స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి జగన్ పాలనలో సంక్షేమం, అభివృద్ధితో ప్రజలు సుభిక్షంగా ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు పడమటి సురేష్‌బాబు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

20వ తేదీ వరకు..

నూజివీడు: రాష్ట్రంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తోన్న సంక్షేమ పథకాలను ప్రజల వద్దకు విస్తృతంగా తీసుకెళ్లేందుకు ఈ నెల ఏడో తేదీ నుంచి 20వ తేదీ వరకు జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో శుక్రవారం మండల సచివాలయ కన్వీనర్లతో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 26 సంక్షేమ పథకాలను అమలు చేయడంతో పాటు గ్రామగ్రామానా సచివాలయ భవనాలు, రైతుభరోసా కేంద్రాలు, వైఎస్సార్ విలేజీ క్లినిక్ భవనాలను నిర్మించిందని, వీటి ద్వారా ప్రభుత్వ పాలనను ప్రజల గడప వద్దకు తీసుకెళ్లిందని చెప్పారు. నాలుగేళ్లలో రూ.2 లక్షల కోట్లను పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలకు నేరుగా ఎలాంటి అవినీతి లేకుండా లబ్ధిదారుల ఖాతాల్లోకి వేసిన ఘనత దేశంలో ఒక్క వైఎస్సార్‌సీపీదే నన్నారు. రెండేళ్లపాటు కరోనా విలయతాండవం చేసినప్పటికీ సమర్థవంతంగా ఎదుర్కొన్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని వివరించారు. చంద్రబాబుకు తాము ఇది చేశామని చెప్పుకోవడానికి ఒక్క సంక్షేమ పథకం కూడా లేదని, దోపిడీకి, వెన్నుపోటుకు చంద్రబాబు బ్రాండ్ అంబాసిడర్ అని ధ్వజమెత్తారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పగడాల సత్యనాణ, వైఎస్సార్ సీ క్రిస్టియన్ మైనారిటీ విభాగం ఏలూరు జిల్లా అధ్యక్షుడు పిళ్లా చరణ్, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు, ముసునూరు జెడ్పీటీసీ సభ్యుడు ప్రతాప్, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు రామిశెట్టి మురళీకృష్ణ, పార్టీ పట్టణ అధ్యక్షులు శీలం రాము, ఆగిరిపల్లి, చాట్రాయి మండలాల మండల కన్వీనర్లు నండూరి భాస్కరప్రసాద్, పుచ్చకాయల సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో సామాజిక విప్లవం

తిరువూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమపథకాలతో సమాజంలో గణనీయ మార్పులు సంభవించాయని తిరువూరు నగర పంచాయతీ చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి అన్నారు. శుక్రవారం తిరువూరులోని పలు వార్డుల్లో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని నిర్వహించిన సందర్భంగా చైర్‌పర్సన్ వార్డు సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు కిట్లను పంపిణీ చేశారు. వైస్ చైర్‌పర్సన్లు విజయలక్ష్మి, వెంకటేశ్వరి, వార్డు కౌన్సిలర్లు మూడు దుర్గారావు, పరసా శ్రీనివాసరావు, ఏరువ ప్రకాష్ రెడ్డి, ఇనపనూరి చిన్నారి, మోదుగు ప్రసాద్, వార్డు కన్వీనర్లు గజ్జల సీతారామారావు, జాకీర్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా 'మా నమ్మకం నువ్వే జగనన్న

గంపలగూడెం: మండలంలోని పలు సచివాలయాల పరిధిలో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథుల ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఇంటింటికి వెళి పార్టీ ప్రచార కార్యక్రమాన్ని కొనసాగించారు. ఆయా కుటుంబాలవారి అనుమతితో వైఎస్సార్ సీపీ స్టిక్కర్లను తలుపులకు అంటించారు.

తిరువూరులో..

తిరువూరు: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం 'మా నమ్మకం నువ్వే జగన్ ' కార్యక్రమం నిర్వహించారు. సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, గ్రామ సచివాలయ సారథులు, కన్వీనర్లు, వాలంటీర్లు పలువురు సంక్షేమపథకాల లబ్ధిదారులను కలిసి వారికి ప్రభుత్వం నుంచి అందుతున్న పథకాలను తెలియజేశారు.


మైలవరంలో ఓ ఇంటి తలుపునకు స్టిక్కర్ అంటిస్తున్న ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

పైడూరుపాడు(విజయావాడ రూరల్): అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయని పైడూరుపాడు సర్పంచ్ వేముల సీతారామయ్య తెలిపారు. పైడూరుపాడు గ్రామంలో శుక్రవారం జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమం జరిగింది.

'మా నమ్మకం నువ్వే జగన్' ప్రారంభం

ఆగిరిపల్లి: మండలంలోని ఆగిరిపల్లి, చొప్పరమెట్ల గ్రామాల్లో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. చొప్పరమెట్లలో వైస్ ఎంపీపీ గడ్డం సాంబశివరావు, పార్టీ గ్రామ అధ్యక్షుడు పల్లగాని వెంకట కోటేశ్వరరావు ఆధ్వర్యంలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఎ.కొండూరులో..

ఎ.కొండూరు: మండలంలోని కంభంపాడు, ఏ.కొండూరు గ్రామాల్లో శుక్రవారం ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్నే మా భవిష్యత్తు మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమాన్ని నిర్వహించారు. వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథుల ఆధ్వర్యంలో నాయకులు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు.

వాడవాడలా జగనన్నే మా భవిష్యత్

నూజివీడు: నూజివీడు పట్టణం, మండలంలో శుక్రవారం వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, కార్యకర్తలు కలిసి జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోన్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. టీడీపీ చేస్తోన్న దుష్ప్రచారం , టీడీపీ నాయకులు చెప్పే మాయ మాటలను నమ్మొద్దని పేర్కొన్నారు. ఇన్ని సంక్షేమ పథకాలను ఆంధ్రప్రదేశ్‌లో తప్ప దేశంలో ఏ రాష్ట్రంలో కూడా అమలుకావడం లేదని చెప్పారు. నూజివీడు ఐదో వార్డులో మున్సిపల్ వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. అన్ని వార్డుల్లోనూ, మండలంలోని అన్ని గ్రామాల్లోనూ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు విస్తృతంగా నిర్వహించారు.


బూరుగుగూడెంలో లబ్ధిదారులకు కరపత్రాలు అందజేస్తున్న దేశిరెడ్డి


నూజివీడులో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ సత్యనారాయణ

కొండపల్లిలో..

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి మున్సిపాల్టీ పరిధిలోని వార్డుల్లో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమైంది. గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వాలంటీర్లు ఇంటింటికెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలపై వారి వ్యక్తిగత అభిప్రాయాలు సేకరించారు.

పేదల సంక్షేమానికి ప్రాధాన్యం

చాట్రాయి: పేదల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని రాష్ట్ర కో–ఆపరేటివ్ యూనియన్ రాష్ట్ర చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని బూరుగుగూడెం గ్రామంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని ఆయన శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. టీడీపీ హయాంలో సంక్షేమాన్ని చంద్రబాబు గాలికి వదిలేయడం వల్లే పేదరికం పెరిగిందని ఆరోపించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక రాజకీయాలకు అతీతంగా నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకి పథకాల సొమ్ము జమ చేయడం వల్ల పేదల్లో కొనుగోలు శక్తి పెరిగిందన్నారు. ఎంపీపీ లంకా నిర్మల, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మిద్దె బాలకృష్ణ, కృష్ణారెడ్డి, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు. నరసిమారావుపాలెంలో మండల సచివాలయ కన్వీనర్ సుబ్బారెడ్డి కార్యక్రమాన్ని ప్రాంభించారు.

భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే

రెడ్డిగూడెం: మండలంలోని పలు గ్రామాల్లో క్రైస్తవులు శుక్రవారం భక్తి శ్రద్ధలతో గుడ్‌ఫ్రైడేను జరుపుకున్నారు. వెలగలగూడెం ఆర్‌సీఎం విచారణ దేవాలయం రెవరెండ్ ఫాదర్ టి. ధానియేల్ మాట్లాడుతూ యేసుక్రీస్తు శిలువ వేసిన రోజును పురస్కరించుకుని ఈ గుడ్‌ఫ్రైడేను జరుపుకుంటారన్నారు. పలు గ్రామాల్లో క్రైస్తవులు శిలువను మోస్తూ ప్రదక్షణలు నిర్వహించారు. అనంతరం ఆర్‌సీఎం చర్చిలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాస్టర్లు బాలస్వామి, జేమ్స్, యేసుపాదం పాల్గొన్నారు.

గంపలగూడెంలో..

గంపలగూడెం: గుడ్‌ఫ్రైడే పర్వదినోత్సవాన్ని మండలంలోని తోటమూల, ఉటుకూరుల్లో ఘనంగా నిర్వహించారు. తోటమూల ఆర్సీఎం చర్చి ఆధ్వర్యంలో శిలువమార్గం నిర్వహించారు. రెవరెండ్ ఫాదర్ రాజేంద్రప్రసాద్, కిషోర్, మరియన్నల పర్యవేక్షణలో క్రైస్తవ విశ్వాసులు ఏసుక్రీస్తు శాలువను మోస్తూ చర్చి వద్ద నుంచి మేడూరు వరకు సిలువ మార్గం ప్రదర్శించారు. ఉటుకూరు చర్చిలో పాస్టర్ ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

ముసునూరులో..

ముసునూరు: గుడ్ ఫ్రైడే సందర్భంగా ఆర్‌సీఎం సంఘ విచారణ కేంద్రాలైన ముసునూరు, రమణక్కపేటల్లో ఫాదర్లు ఏసురాజన్, సాల్‌మన్ రాజు, జేమ్స్ దేవసహాయం, రాజశేఖర్, వేలాంగణిల ఆధ్వర్యంలో ది లాస్ట్ సప్పర్ (ప్రభు కడ రాత్రి భోజనం) కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో ఆచరించారు. ఏసుక్రీస్తు తన శిష్యుల పాదాలు కడిగిన అంశాన్ని గుర్తు చేసుకున్నారు. చింతలవల్లి, వేల్పుచర్ల, యల్లాపురం, కాట్రేనిపాడు, లోపూడి, వలసపల్లి, చెక్కపల్లి ఆర్‌సీఎం సంఘాల్లో ఏసుక్రీస్తును శిలువ వేయడానికి ముందు అక్కడి యూదులు ఆయన తలపై ముళ్లకిరీటం పెట్టి, కొరడాలతో కొడుతూ, శిలువ మోయించారు. చింతలవల్లిలో సంఘ ఉపదేశి దేవరపల్లి బెనర్జీ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

ఎ.కొండూరులో..

ఎ.కొండూరు: మండలంలోని చీమలపాడు, ఏ.కొండూరు, కంభంపాడు, రేపూడి, కృష్ణారావుపాలెం, పోలిశెట్టిపాడు పలు గ్రామాల్లోని చర్చిల్లో శుక్రవారం క్రైస్తవులు భక్తి శ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.


వెలగలగూడెంలో శిలువను మోస్తూ ప్రదర్శనలో పాల్గొన్న క్రైస్తవులు

చాట్రాయిలో..

చాట్రాయి: మండలంలోని చనుబండ, చాట్రాయి, కోటపాడు ఆర్‌సీఎం విచారణ పరిధిలో ఫాదర్లు మద్దాల జోసఫ్, పోలిశెట్టి జయరాజు, చౌటపల్లి ప్రశాంత్ కుమార్ ఆధ్వర్యంలో శిలువను మోస్తూ పాటలు పాడుకుంటూ ఆయా గ్రామాల్లో తిరిగారు. సీఎస్ఐ, పెంతికోస్తు, క్రీస్తు సంఘం చర్చిల్లో ప్రార్థనలు చేశారు.

తిరువూరులో..

తిరువూరు: ప్రేమ, త్యాగాలకు ప్రతీకగా గుడ్‌ఫ్రైడేను జరుపుకుంటారని తిరువూరు ఆర్‌సీఎం చర్చి ఫాదర్ రెవరెండ్ జే విజయకుమార్ అన్నారు. గుడ్‌ఫ్రైడే సందర్భంగా శుక్రవారం తిరువూరులో శిలువ మార్గం నిర్వహించారు. క్రాస్ బాప్టిస్టు, సీఎస్ఐ, చర్చి ఆఫ్ క్రైస్టు, తెలుగు బాప్టిస్టు, కల్వరి, ఏల్ బేతేల్, హోసన్నా, హౌస్ ఆఫ్‌ప్రేయర్ చర్చిల్లో ప్రార్థనలు నిర్వహించారు.

ఇబ్రహీంపట్నంలో..

ఇబ్రహీంపట్నం: మండలంలోని పలు గ్రామాల్లో ఆర్సీఎం, సీఎస్ఐ ఇతర చర్చిల్లో శుక్రవారం గుడ్‌ఫ్రైడే సందర్భంగా తెల్లవారు జామున ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గుంటుపల్లి, కొండపల్లి, ఇబ్రహీంపట్నం, కిలేశపురం, మూలపాడు ఆర్సీఎం చర్చిల్లో శిలువమార్గం నిర్వహించారు. డాన్‌బాస్కో, సెయింట్ ఆన్స్ స్కూల్స్ సిస్టర్లు, మాలాధారులు పాల్గొన్నారు.

మైలవరంలో..

మైలవరం: ఏసుక్రీస్తు సన్మార్గ జీవితం అందరికీ అనుసరణీయమని మైలవరం విచారణ గురువు రెవరెండ్ ఫాదర్ సందిపాము జోజప్ప తెలిపారు. మైలవరం ఆర్‌సీఎం చర్చి ఆధ్వర్యంలో గుడ్ ఫ్రైడేను శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో అతిథి గురువులు రెవరెండ్ ఫాదర్స్ ఆరోగ్య జోజిబాబు ఉపదేశకులు, విన్సెంట్ పాల్ సభ్యులు పాల్గొన్నారు.


గంపలగూడెం మండలం తోటమూలలో శిలువమార్గంలో పాల్గొన్న క్రైస్తవులు


చింతలవల్లిలో శిలువ మార్గం నిర్వహిస్తున్న క్రైస్తవులు

ఆగిరిపల్లి మండలంలో గుడ్ ఫ్రైడే

ఆగిరిపల్లి: మానవాళి పాప పరిహారార్థం క్రీస్తు శిలువ మరణం పొందారని పాస్టర్ కొల్లూరి ఐజక్ జాన్ అన్నారు. మండలంలో గుడ్ ఫ్రైడేను క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కనసానపల్లి సీఎస్ఐ చర్చి, అడవినెక్కలంలో శశిధర్, ఆగిరిపల్లిలో నిరీక్షణకుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

నూజివీడులో..

నూజివీడు: రాజీవ్‌సర్కిల్‌లోని మేరీమాత చర్చి పాస్టర్ డేవిడ్‌రాజు నేతృత్వంలో విశ్వాసులు పట్టణంలో సిలువతో ర్యాలీ నిర్వహించారు. పాస్టర్ డేవిడ్ రాజు మాట్లాడుతూ మానవాళి పట్ల ప్రేమ, నిస్సహాయుల పట్ల కరుణ, శత్రువుల పట్ల క్షమ, ఆకాశమంతటి సహనం జీసస్ తన జీవితం ద్వారా మానవాళికి ఇచ్చిన సందేశమన్నారు. నెహ్రూపేట ఆర్సీఎం రక్షకమాత ఆలయం విచారణ గురువులు రెవ. ఫాదర్ జోసెఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం గుడ్‌ఫ్రైడే నిర్వహించారు.

విస్సన్నపేటలో..

విస్సన్నపేట: గుడ్‌ఫ్రైడే సందర్భంగా స్థానిక లూర్ధునగర్ ఆర్‌సీఎం చర్చి ఆధ్వర్యంలో పుట్రేల రోడ్డు నుంచి నూజివీడు రోడ్డులో ఆర్సీఎం చర్చి వరకు శిలువ మార్గం నిర్వహించారు. మండలంలోని పుట్రేల గ్రామంలో ఏసు సందేశం వివరించారు.

పేదల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

ముసునూరు: పేదల అభ్యున్నతి, వారి సంక్షేమమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు పేర్కొన్నారు. మండలంలోని లోపూడి గ్రామంలో శుక్రవారం ఆయన నేతలతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. మహిళలను, వృద్ధులను పలకరిస్తూ, వారికి ప్రభుత్వం నుంచి వారు పొందిన లబ్ధిని వివరించారు. తమ ప్రభుత్వంలో పథకాలతో లక్షలాది మంది పేదలకు నేరుగా ప్రయోజనం కలిగిస్తున్నామన్నారు. రానున్న కాలంలో మరిన్ని పథకాలను పేద కుటుంబాలకు అందించనున్న జగనన్న ప్రభుత్వాన్ని ఆదరించాలని కోరారు. తొలుత ఇటీవల నిర్మించిన వైఎస్సార్ రచ్చబండ వద్ద దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటానికి నివాళులర్పించి కార్యక్రమాన్ని ప్రారంభించారు.


లోపూడిలో సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

కార్యక్రమంలో జెడ్పీటీసీ వరికూటి ప్రతాప్, వైస్ ఎంపీపీ కె.రాజానాయన, సర్పంచ్ పేరం కృష్ణ, ఉప సర్పంచ్ బాబూరావు, రమణక్కపేట సర్పంచ్ రంగు ధనలక్ష్మీ గాంధీ, చెక్కపల్లి ఉప సర్పంచ్ పద్మజా దేవేంద్ర, తహసీల్దార్ డి.సుధ, ఇన్‌చార్జి ఎంపీడీఓ సత్యనారాయణ, ఏఈ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

వ్యాయామంతో వ్యాధులు దూరం

తిరువూరు: రోజూ వ్యాయామం చేస్తే వ్యాధుల బారిన పడకుండా ఉండవచ్చని తిరువూరు వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు తాళ్లూరి రామకోటేశ్వరరావు అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవ సందర్భంగా శుక్రవారం తిరువూరు బోస్ సెంటర్ నుంచి ఎన్టీఆర్ స్టేడియం వరకు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. వాకర్స్ అసోసియేషన్ సభ్యులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. నిత్యం కనీసం గంటసేపు నడక లేదా సైక్లింగ్, వ్యాయామం చేసిన వారికి సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని, రక్తపోటు, మధుమేహం వంటి వ్యాధులు దరిచేరవని రామకోటేశ్వరరావు తెలిపారు. పోలీసు ఉద్యోగాలకు సిద్ధమవుతున్న యువకులకు ఇటీవల నిర్వహించిన పోటీలలో గెలుపొందినవారికి బహుమతులందజేశారు. స్టేడియం ఆవరణలో వాటర్ ప్యూరిఫయర్‌ను సిటీకేబుల్ నిర్వాహకులు కిలారు శివరామకృష్ణ వితరణ ఇచ్చారు. గంపలగూడెం తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి, గుళ్లపల్లి వెంకటరత్నం పాల్గొన్నారు.


తిరువూరులో ప్రపంచ ఆరోగ్య దినోత్సవ ప్రదర్శన

ఈఎంటీ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ఇబ్రహీంపట్నం: 108 అంబులెన్స్ సర్వీసులో ఈఎంటీ(ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్స్)గా పనిచేసేందుకు ఆసక్తిగల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డివిజన్ అధికారి డి.నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. బీఎస్సీ బయాలజీ, బీజెడ్‌సీ, జీఎన్‌ఎం, బీఎస్సీ నర్సింగ్, బయోకెమిస్ట్రీ, మైక్రో బయాలజీ, బీఫార్మసీ అర్హతతో 30ఏళ్లలోపు వయస్సుగల అభ్యర్థులు తమ బయోడేటా, సర్టిఫికెట్లతో ఏప్రిల్ 12వ తేదీలోపు 79012 40840 నంబర్‌కు వాట్సాప్ చేయాలని పేర్కొన్నారు. విజయవాడ, జికొండూరు, కంచికచర్ల, ఇబ్రహీంపట్నం, నందిగామ, జగ్గయ్యపేట, వీరులపాడు మండలాల్లో ఖాళీలు ఉన్నాయని తెలిపారు.

పథకాల అమలు చరిత్రలోనే సువర్ణాధ్యాయం

మైలవరం: సంక్షేమ పథకాలు సొమ్మును నేరుగా డైరెక్ట్ బెనిఫిషర్ ట్రాన్స్‌ఫర్(డీబీటీ) ద్వారా అవినీతికి తావు లేకుండా లబ్ధిదారులకు అందజేయడం దేశ చరిత్రలోనే సువర్ణాధ్యాయం అని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ తెలిపారు. ఎమ్మెల్యే కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఎన్ని ఇబ్బందులు ఉన్నా, ఎన్ని విపత్తులు ఎదురైనా ఆడిన మాట మేరకు ప్రతి సంక్షేమ పథకాన్ని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేశారన్నారు. జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులంతా కలసి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, పార్టీలో ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి కృషి చేయాలన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్

98 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి

ఆగిరిపల్లి: మండలంలో వైఎస్సార్ సామాజిక పింఛన్ల పంపిణీ 98 శాతం పూర్తయినట్లు ఎంపీడీఓ కె.వాణి శుక్రవారం తెలిపారు. మొత్తం 19 గ్రామ సచివాలయాల్లో 9,524 పింఛన్లకు 98 శాతం గ్రామవార్డు వలంటీర్లు పంపిణీ చేశారని పేర్కొన్నారు.

రేపు అండర్-17 బాలబాలికల క్రికెట్ సెలక్షన్స్

ఇబ్రహీంపట్నం: ఎన్టీఆర్ జిల్లా టెన్నిస్ బాల్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి కృష్ణా జిల్లా అండర్–17 బాలబాలికల టెన్నిస్ బాల్ క్రికెట్ సెలక్షన్స్ ఈ నెల 9వ తేదీన నిర్వహించనున్నట్లు జిల్లా క్రికెట్‌బాల్ టెన్నిస్ అసోసియేషన్ కార్యదర్శి బి.వెంకటేష్ నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎన్టీటీపీఎస్ గ్రౌండ్‌లో జరిగే పోటీల్లో ఎంపికైన బాలబాలికలు ఈ నెల 22, 23 తేదీల్లో అనంతపురం జిల్లాలో జరిగే అండర్–17 రాష్ట్ర స్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారు. ఆసక్తిగల క్రీడాకారులు తమ ఆధార్‌కార్డులు తీసుకుని ఆ రోజు ఉదయం హాజరు కావాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 93912 83387లో సంప్రదించాలని కోరారు.

పోయిన ఫోన్ సాంకేతిక పరిజ్ఞానంతో లభ్యం

చాట్రాయి: పోయిన ఫోన్ సాంకేతిక పరిజ్ఞానంతో లభ్యమైంది. చింతలపూడి మండలం నాగిరెడ్డి గూడెంకి చెందిన భూక్యా జ్యోతి శుక్రవారం ఉదయం తన భర్తతో ద్విచక్రవాహనంపై విస్సన్నపేట వెళ్తున్నారు. సంచిలో ఫోన్ పెట్టి బండికి తగిలించింది. సైలెన్సర్ కాలి ఫోన్ కిందపడిపోయింది. కొంతదూరం వెళ్లాక ఫోన్ కనిపించలేదు. దీంతో చాట్రాయి పోలీస్ స్టేషన్‌కి వచ్చి ఫోన్ పోయిందని ఫిర్యాదు చేశారు. పోలీసులు సాంకేతిక పరిజ్ఞానంతో ఫోన్‌ను గంటలో కనుగొని బాధితురాలికి ఏఎస్సై గజపతి అందజేశారు.